# సత్తాచాటుకునేందుకు సువర్ణ అవకాశం

- ప్రతిభను వెలికితీయాలనే ఉద్దేశంతోనే ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు
- ఒంగోలు నియోజకవర్గ ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే బాలినేని


నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీల్లో బ్యాటింగ్ చేసి క్రికెట్ మ్యాచ్‌ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ సుజాత

**ఒంగోలు:** సత్తా చాటుకునేందుకు సువర్ణ అవకాశం మన రాష్ట్రంలోని యువతకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని దానిని యువత సద్వినియోగం చేసుకోవాలని మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మినీ స్టేడియంలో బుధవారం ఒంగోలు నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. ఒంగోలు నగర పరిధిని రెండు మండల టీములుగా, ఒంగోలు రూరల్, కొత్తపట్నం వెరసి నాలుగు జట్లు ఈ పోటీలో తలపడగా పీర్లమాన్యం సచివాలయ జట్టు, కరవది సచివాలయ జట్టు క్రికెట్ క్రీడాకారులను బాలినేని పరిచయం చేసుకున్నారు. గ్రామ, మండల స్థాయిలో విజేతగా నిలిచి నియోజకవర్గ పోటీలకు చేరుకున్నారని క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి నియోజకవర్గం నుంచి రాష్ట్రస్థాయిలో కూడా ప్రతిభ చాటుకోవాలన్నారు. కేవలం క్రీడలు నిర్వహించడమే కాకుండా వాటికి అవసరమైన క్రీడా పరికరాలను కూడా అందిస్తూ ప్రభుత్వం నిర్వహిస్తున్న పోటీల్లో పాల్గొన్న, వాటిని వీక్షిస్తున్న ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ఒక మంచి వాతావరణంలో జరుగుతున్న ఆటల పోటీలు యువతలో ఎనలేని ఉత్సాహాన్ని అందిస్తున్నాయన్నారు. తమకు ఎవరు మంచి చేస్తున్నారో బేరీజు వేసుకోవాలని సూచించారు. అనంతరం కొద్దిసేపు బాలినేని, నగర మేయర్ గంగాడ సుజాత క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఈదర చిన్నారి, జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి గుంటి రాజరాజేశ్వరి, నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, కొత్తపట్నం ఈవోఆర్‌డీ బాలచెన్నయ్య, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరెడ్డి అరుణ, కార్పొరేటర్లు జెడా వెంకటేష్, యనమల నాగరాజు, తాడి కృష్ణలత, నీలంరాజు సరోజ, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, మూడో క్లస్టర్ ఇన్‌చార్జి గంటా రామానాయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చింతగుంట్ల సువర్ణ, రావులపల్లి ధనలక్ష్మి యాదవ్, తూము పద్మ, మైనార్టీ నగర అధ్యక్షులు మీరావలి తదితరులు పాల్గొన్నారు.


క్రికెట్ ఆడుతున్న మేయర్ గంగాడ సుజాత

**తొలి రోజు ఆటల పోటీల వివరాలు:**

■ నియోజకవర్గ స్థాయిలో తొలిరోజు క్రికెట్ పోటీలకు సంబంధించి తొలి పోటీ త్రోవగుంట–కొత్తపట్నం జట్ల మధ్య జరిగింది. సిక్సర్లు బాదుతూ క్రీడాభిమానులకు కనువిందు చేశారు. తొలుత బ్యాటింగ్ చేసిన త్రోవగుంట జట్టు నిర్ణీత పది ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 93 పరుగులు చేయగా, అనంతరం బరిలోకి దిగిన కొత్తపట్నం జట్టు 9 ఓవర్లలోనే కేవలం రెండు వికెట్లు కోల్పోయి 94 పరుగులు చేసి విజయాన్ని కైవసం చేసుకుంది. సాయంత్రం కరువది–పీర్లమాన్యం జట్ల మధ్య మ్యాచ్ జరగ్గా పీర్లమాన్యం జట్టు విజయాన్ని కైవసం చేసుకుంది. దీంతో కొత్తపట్నం– పీర్లమాన్యం జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్, త్రోవగుంట–కరువది జట్ల మధ్య మూడో స్థానం ఎంపిక కోసం గురువారం పోటీలు నిర్వహించనున్నారు.

**షటిల్ బ్యాడ్మింటన్:**

పురుషుల విభాగంలో శ్రీనివాస కాలనీ జట్టు ప్రథమ స్థానం, కొత్తపట్నం జట్టు ద్వితీయ, కోట వీధి జట్టు తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. మహిళల విభాగంలో రాజాపానగల్ రోడ్డు ప్రథమ స్థానం, గుడిమెళ్లపాడు ద్వితీయ, కొత్తపట్నం తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నాయి.


నియోజకవర్గం స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలో తలపడుతున్న ఈతముక్కల సచివాలయం, శ్రీరామ్‌కాలనీ సచివాలయం జట్లు

# వైఎస్సార్ సీపీతోనే మైనార్టీలకు మేలు

- షాదీఖానా పూర్తి చేస్తున్నది మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డే
- పూర్తి స్థాయిలో అవగాహనతో టీడీపీ నాయకులు మాట్లాడాలి
- జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ జలీల్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ జలీల్

**ఒంగోలు సెంట్రల్:** మైనార్టీలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే మేలు జరిగిందని, షాదీఖానా కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అన్ని హంగులతో పూర్తవుతుందని జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ జలీల్ అన్నారు. స్థానిక షాదీఖానా ఆవరణలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ జలీల్ మాట్లాడుతూ టీడీపీ హయాంలో కేవలం రూ.75 లక్షలు మాత్రమే కేటాయించిన మాట వాస్తవం కాదా అని అన్నారు. ఎమ్మెల్యే బాలినేని వాసన్న ఆధ్వర్యంలో రూ.4.78 కోట్లు మంజూరై ప్రస్తుతం పనులు పూర్తవుతున్నాయని అన్నారు. కార్పొరేషన్ చైర్మన్ గంగాడ సుజాత కూడా పనులపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచారన్నారు. ముస్లిం మైనార్టీలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అనేక పథకాలతో లబ్ధి చేకూరిందన్నారు. చెప్పాడంటే చేసే మనస్తత్వం కలిగిన వాసన్న గురించి అవాకులు మాట్లాడితే బాగుండదని హెచ్చరించారు. త్వరలోనే షాదీఖానా పూర్తయి ఉపయోగంలోకి వస్తుండటంతో ముస్లింలు అందరూ వాసన్నకు కృతజ్ఞత చెబుతున్నామని అన్నారు. పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ మున్నా మాట్లాడుతూ షాదీఖానాను చూసిన టీడీపీ వారు సైతం ఎంతో మెచ్చుకుంటున్నారని ఈ విధంగా తయారవుతుందని ఊహించలేదని అన్నారు. షాదీఖానా పూర్తి చేసి పేద ముస్లింల పెళ్లి ఖర్చు సైతం మొదటగా తాను భరిస్తానని వాసన్న హామీ ఇవ్వటం పట్ల ముస్లింలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ విభాగం కార్యదర్శి షేక్ హసీమ్ బాషా, 4వ డివిజన్ అధ్యక్షుడు షేక్ కాలేషా, మైనార్టీ నాయకులు జాఫర్, హయ్యద్ బాషా, రహీం, అల్తాఫ్, ఖాదర్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సై ఉద్యోగాలు సాధించిన వారికి ఎస్పీ అభినందన

**ఒంగోలు:** పోలీసుశాఖలో కానిస్టేబుళ్లుగా పనిచేస్తూ ఎస్సైలుగా ఎంపికైన నలుగురిని ఎస్పీ మలికాగర్గ్ బుధవారం తన చాంబరులో ప్రత్యేకంగా అభినందించారు. మార్కాపురం డీఎస్పీ కార్యాలయంలో పనిచేస్తున్న పి.వెంకటేశ్వరరెడ్డి, కొత్తపట్నం పీఎస్‌లో పనిచేస్తున్న ఏ.అలేఖ్య, స్పెషల్ పార్టీలో విధులు నిర్వహిస్తున్న జి.రాజశేఖర్ అనే ముగ్గురు సివిల్ ఎస్సై ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మరో స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ షేక్ సిరాజ్ ఏపీ స్పెషల్ పార్టీలో ఎస్సైగా ఎంపికయ్యారు. పోలీసుశాఖలో విధులు నిర్వహిస్తూ పట్టుదలతో ఎస్సై ఉద్యోగాలకు ఎంపిక కావడం గొప్ప విషయం అని, త్వరలో శిక్షణ ముగించుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు.


కానిస్టేబుళ్లను అభినందిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

## క్లుప్తంగా

### సొసైటీ చైర్మన్‌కు మాతృవియోగం


కమలమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న బాలినేని

**ఒంగోలు రూరల్:** రూరల్‌లోని కరవది సొసైటీ చైర్మన్ వాకా కృష్ణారెడ్డి తల్లి కమలమ్మ (80) ఉదయం మృతి చెందారు. ఆమె మృతి వార్త తెలుసుకున్న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మధ్యాహ్నం కరవది చేరుకుని ఆమె భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కృష్ణారెడ్డిని ఓదార్చారు. కమలమ్మకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట నగర నాయకులు, రూరల్ వైఎస్సార్ సీపీ నాయకులు, అధ్యక్షులు, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు ఉన్నారు. పలువురు అధికారులు కృష్ణారెడ్డిని పరామర్శించారు.

### బాలికా హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

- కలెక్టర్ దినేష్‌కుమార్


ర్యాలీని జెండాఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

**ఒంగోలు అర్బన్:** బాలికా హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని అందరం కలిసికట్టుగా కృషి చేయాలని కలెక్టర్ ఏస్ దినేష్‌కుమార్ అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కలెక్టరేట్ నుంచి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ జండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలికా హక్కులపై రూపొందించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. దీనిలో బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యురాలు బత్తుల పద్మావతి, ఐసీడీఎస్ పీడీ మాధురి, మెప్మా పీడీ రవికుమార్, బాల సంక్షేమ కమిటీ చైర్మన్ రామాంజనేయులు, డీసీపీవో దినేష్‌కుమార్, ఎల్‌పీఓఆర్ పద్మ, సీడీపీవో రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

### పొగాకు క్యూరింగ్, గ్రేడింగ్‌లో జాగ్రత్తలు పాటించాలి


శిక్షణకార్యక్రమంలో మాట్లాడుతున్న ఒంగోలు-2 వేలం నిర్వహణాధికారి కోవి రామకృష్ణ

**ఒంగోలు సెంట్రల్:** పొగాకు రెలుపు, క్యూరింగ్, గ్రేడింగ్‌లలో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించాలని ఒంగోలు–2 వేలం నిర్వాహణాధికారి కోవి రామకృష్ణ అన్నారు. ఒంగోలు–2 పరిధిలోని సీహెచ్ ఉప్పలపాడు గ్రామంలో రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఐటీసీ ప్రతినిధి యశ్వంత్ మాట్లాడుతూ బ్యారన్ పరిమితి మించి ఎక్కువ కర్రలను ఉపయోగించరాదని చెప్పారు. రైతులకు పలు సూచనలిచ్చారు. జీపీఐ ప్రతినిధి కళ్యాణ్, పీఎస్ఎస్‌హెచ్ ప్రతినిధి రామాంజనేయ రెడ్డి, బోర్డు సిబ్బంది, రైతు నాయకులు పాల్గొన్నారు.

# బాలల హక్కులపై విద్యార్థినులకు అవగాహన

**ఒంగోలు:** జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా స్థానిక పీవీఆర్ బాలికోన్నత పాఠశాలలో బాలల హక్కులపై బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి అవగాహన కల్పించారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల చట్టం గురించి, చైల్డ్ హెల్ప్‌లైన్, దిశ యాప్ వినియోగం ఎలా, దానివల్ల ఉపయోగాలను వివరించారు. గతంలో పాఠశాలలో ఏర్పాటు చేసిన 11మంది బాలికల హక్కుల క్లబ్ చేసిన కార్యక్రమాలను పరిశీలించారు. వ్యాసరచన, చిత్రలేఖన పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బంకా లక్ష్మీ ప్రసన్న, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. జాతీయ స్థాయి ఐస్ కర్లింగ్ గేమ్స్‌లో జూనియర్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి మెడల్స్, కప్ సాధించిన విద్యార్థినులను బత్తుల పద్మావతితో పాటు ఉప విద్యాశాఖ అధికారి అనిత రోజ్‌రాణి, మండల విద్యాశాఖ అదికారి సరస్వతి తదితరులు అభినందించారు.


మాట్లాడుతున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి

## పీఎం యశస్వికి దరఖాస్తు చేసుకోండి

**ఒంగోలు సెంట్రల్:** కేంద్ర ప్రభుత్వ ఉపకార వేతనం (పీఎం యశస్వి) విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమాధికారి ఎం.అంజల కోరారు. కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన పాఠశాల, కళాశాలల్లో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. రూ.2.50 లక్షల లోపు ఆదాయం, ఓబీసీ కుల, ఆధార్ ధ్రువీకరణ పత్రాలు విద్యార్థుల తల్లిదండ్రులు కలిగి ఉండాలని చెప్పారు. గత సంవత్సరం మార్కుల జాబితాతో పాటు ఎన్.ఎస్.పి పోర్టల్ ద్వారా అప్లోడ్ చేసి, సంబంధిత పాఠశాల లేదా కళాశాల హెడ్ ఆఫ్‌ది ఇనిస్టిట్యూట్ (నోడల్ అధికారి) బయో మెట్రిక్ అథెంటికేషన్ వేయించాలని చెప్పారు. ఈనెల 31వ తేదీ లోపు ఒంగోలు జిల్లా బీసీ సంక్షేమ కార్యాలయానికి పోర్టల్ ద్వారా మాత్రమే పంపాలని కోరారు.

## స్కాలర్‌షిప్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి

**ఒంగోలు:** 2023 ఫిబ్రవరిలో నిర్వహించిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షల్లో ఎంపికైన విద్యార్థులు తమ వివరాలను నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో ఈనెలాఖరులోగా నమోదు చేసుకోవాలని డీఈవో వీఎస్ సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2019 నవంబరు, 2021 ఫిబ్రవరి, 2022 మార్చిలో ఎంపికైన విద్యార్థులు కూడా ఈనెలాఖరులోగా రెన్యువల్ చేసుకోవాలన్నారు. విద్యార్థిపేరు, తండ్రిపేరు, పుట్టిన తేదీల్లో తేడా ఉన్నా మిస్ మాచ్ ప్రొఫార్మాలో ఈనెల 27వ తేదీలోగా పూర్తిచేసి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు.

# నేడు అక్కినేని విగ్రహావిష్కరణ

**ఒంగోలు:** దివంగత సినీ హీరో అక్కినేని నాగేశ్వరరావు విగ్రహాన్ని గురువారం సాయంత్రం 5.30 గంటలకు ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు సంబంధిత బ్రోచర్‌ను డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, శ్రీప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథం, అక్కినేని కళాపరిషత్ అధ్యక్షుడు కళ్లగుంట కృష్ణయ్య తదితరులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం స్థానిక లాయరుపేటలోని డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా వేమూరి సూర్యనారాయణ మాట్లాడుతూ అక్కినేని నాగేశ్వరరావు నటన గురించి వర్ణించడం అద్వితీయం అన్నారు. అక్కినేనిని ఆరాధించని తెలుగు ప్రేక్షకులు ఉండరని, ఆయన ఎంతోమంది నటీనటులకు ఇన్‌స్పిరేషన్ అని శ్రీప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథం అన్నారు. అక్కినేని కళాపరిషత్ అధ్యక్షులు కళ్ళగుంట కృష్ణయ్య మాట్లాడుతూ స్థానిక నూతన కూరగాయల మార్కెట్ వద్ద ఏర్పాటుచేసిన అక్కినేని నాగేశ్వరరావు విగ్రహానికి పెద్దమనస్సు అందించి విగ్రహదాతగా ముందుకు వచ్చిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమం అనంతరం పాటకచ్చేరి కూడా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గాయకులు విజయ్, మోహన్‌రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమారెడ్డి ఉన్నారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ

# రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

- కలెక్టర్ దినేష్‌కుమార్

**ఒంగోలు అర్బన్:** రహదారి భద్రత, ప్రమాదాల నివారణపై ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రకాశం భవనంలో రహదారి భద్రత కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. దీనిలో గత ఏడాది రహదారి భద్రతపై తీసుకున్న చర్యలపై సమీక్షించారు. ఒంగోలు నగరంలో ఆటో పికప్ పాయింట్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లపై ఆవులు, ఇతర పశువులు లేకుండా పశు యాజమాన్యానికి అవగాహన కల్పించాలన్నారు. బ్లాక్ స్పాట్స్ సమీపంలో ఉన్న దుకాణదారులకు ప్రథమ చికిత్స ప్రమాదాలు సంబంధించినప్పుడు తీసుకోవాల్సిన ప్రాథమిక చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. రవాణా సంస్థ, పోలీసు, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఉపరవాణా కమిషనర్ సుశీల 2019, 2020, 2021 సంవత్సరాల్లో గుర్తించిన బ్లాక్‌స్పాట్స్ నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. వాటికి సంబంధించి రూ.8.96 కోట్లతో రాష్ట్ర రవాణ కమిషనర్‌కు నివేదికలు అందజేసినట్లు కలెక్టర్‌కు తెలిపారు. సమావేశంలో ఆర్అండ్‌బీ, పశుసంవర్ధక శాఖ, నేషనల్ హైవేస్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

# మెట్ట తామరతో మురుగు నీటి సమస్య పరిష్కారం

**చీమకుర్తి:** మురుగు కాలువల్లో మెట్ట తామర మొక్కలను నాటడం వలన మురుగు నీటి సమస్య పరిష్కారమవుతుందని డీపీఓ జీవీ నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం సంతనూతలపాడులోని శివాలయం వద్ద ఉన్న ప్రధాన మురుగు కాలువలో మెట్ట తామర మొక్కలను నాటించే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మెట్ట తామర మొక్కలను నాటడం వలన మురుగు నీరు తగ్గడమే కాకుండా దోమల ఉత్పత్తి కూడా తగ్గిపోతుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దర్శి నాగమణి, ఈఓఆర్‌డీ రామకృష్ణ, స్థానిక సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మెట్ట తామర మొక్కల నాటే కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న డీపీఓ నారాయణరెడ్డి

## మిరప తెగుళ్లపై రైతులకు అవగాహన

**చీమకుర్తి:** మిరప పంటకు ఆశించిన తెగుళ్లపై హార్టికల్చర్ ఆఫీసర్ సంధ్య రైతులకు అవగాహన కల్పించారు. బుధవారం బూదవాడ, మైలవరం, పులికొండ గ్రామాల్లో రైతులు సాగు చేసిన మిరప పంటలను పరిశీలించారు. ఇటీవల డిసెంబర్‌లో కురిసిన వర్షాలకు మిరప పంటకు తామర పురుగు, తెల్లదోమ ఎక్కువగా కనిపించినట్లు గుర్తించారు. దానితో పాటు కాయకుళ్లు తెగులు, ఎండు కొమ్మ తెగులు కూడా సోకినట్లు గుర్తించినట్లు తెలిపారు.

# జీవనోపాధికి ఆర్థిక సహాయం

**ఒంగోలు అర్బన్:** మార్కాపురానికి చెందిన ఆఫ్రిన్‌కు జీవనోపాధి కల్పించేలా సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్టు ఆర్థిక సహాయం అందించి మానవత్వం చాటుకుంది. ఆఫ్రిన్ తల్లి మూత్రపిండాల వ్యాధితో ఇబ్బంది పడుతూ కుటుంబ పోషణ కష్టంగా మారిన విషయం తెలుసుకున్న ట్రస్టు సభ్యులు బాధితురాలికి బుధవారం నగరంలోని ట్రస్టు కార్యాలయంలో ఆర్థిక సహాయంతో పాటు రూ.16 వేల విలువైన ఫ్యాన్‌లు, హాట్‌బాక్స్‌లు, కూల్‌డ్రింక్ బాటిల్స్ అందజేశారు. చదువులో రాణిస్తున్న ఆఫ్రిన్‌కు చదువుకునేందుకు సహాయ సహకారాలు అందిస్తామని ట్రస్ట్ సెక్రటరీ సర్దార్‌బాష తెలిపారు.

# మహిళా చైతన్యంతో కుటుంబాల్లో ఆర్థిక స్థిరత్వం

**నాగులుప్పలపాడు:** మహిళల చైతన్యంతోనే కుటుంబాల్లో ఆర్థిక స్థిరత్వం ఏర్పడుతుందని జనశిక్షణ సంస్థ డైరెక్టర్ శ్యామ్ సునీల్ అన్నారు. జన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఉప్పుగుండూరు గ్రామంలో మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసి శిక్షణ పూర్తయిన సందర్భంగా బుధవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ది ప్రకాశం జిల్లా సహకార బ్యాంక్ ఉప్పుగుండూరు బ్రాంచి మేనేజర్ ఝాన్సీ రాణి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో కీలకమైన పాత్ర పోషించాలని కోరారు. సామాజిక సేవా కార్యకర్త తెలగతోటి శ్యామ్యూల్ మాట్లాడుతూ గ్రామంలోని మహిళలకు చేయూతగా ఉండేందుకు చేపట్టిన ఈ కార్యక్రమం చాలా ఉపయోగకరమైందన్నారు. కార్యక్రమంలో టైలరింగ్ ఉపాధ్యాయురాలు శివపార్వతి, బ్యాంక్ సిబ్బంది కోట రమేష్, అబ్దుల్ రహీమ్ తదితరులు ఉన్నారు.


శిక్షణ పూర్తైన వారికి సర్టిఫికెట్ అందిస్తున్న జనశిక్షణ సంస్థ ప్రతినిధులు

## బాలికలు స్వతంత్రంగా ఎదగాలి


వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, టీచర్‌లు

**చీమకుర్తి:** ఎలాంటి ఆటంకాలు లేకుండా బాలికలు స్వతంత్రంగా ఎదగాలని సార్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి బీ.ప్రసాద్ విద్యార్థినులకు విజ్ఞప్తి చేశారు. బాలికా విద్య సందర్భంగా బుధవారం సంతనూతలపాడు మండలం మంగమూరు జిల్లా పరిషత్ హైస్కూలులోని బాలికలకు బాలికా విద్యపై అవగాహన కల్పించారు. బాలికా విద్యకు సంబంధించిన వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు.

## 30న మండల సర్వసభ్య సమావేశం

**కొత్తపట్నం:** ఈ నెల 30న మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షుడు లంకపోతు అంజిరెడ్డి అధ్యక్షతన మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత తెలిపారు. మండల, జిల్లా స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావల్సిందిగా కోరారు. గైర్హాజరైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు తప్పనిసరిగా హాజరు కావల్సిందిగా కోరారు.

## పాఠశాలకు బీరువా వితరణ

**చీమకుర్తి:** గ్రానైట్ యజమాని నూనె వెంకట సుబ్రహ్మణ్యం పాటిమీదపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు బీరువాను బహూకరించారు. నూనె వెంకట లక్ష్మీ సుజాత ప్రథమ వర్ధంతి సందర్భంగా బుధవారం పాఠశాల హెచ్ఎం శిలార్‌సాహెబ్‌కు అందించారు. దానితో పాటు సంతనూతలపాడు వాసవీక్లబ్ వారికి గ్రైండర్‌ను అందించారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.